# పలకరింపుల బాణాలు

విజయలక్ష్మి

"చీకటయింది ఇక పోదాం" అన్నాను.

"అలసిపోయానని చెప్పరాదూ" అంది చిత్ర.

"పోనీ ఒప్పుకున్నానులే పద" అన్నాను. ఇద్దరం చేతిరుమాళ్ళతో ముఖాలు తుడుచుకుంటూ, 'బ్యాట్స్' వూగులాడించుకుంటూ వచ్చి కుర్చీల్లో కూలబడి అలసట తీర్చుకుంటున్నాం. ఆ మధ్య పరీక్షల బాదరబందీతో క్లబ్బు కేసి రాలేదు. ఏదో ఆ పీడ వదిలిందనుకున్న తర్వాత యీ రోజే క్లబ్బు కొచ్చాం! కరువుదీరా ఆడుకున్నాం. ఇంతలో సరళా, శ్యామలా వచ్చి మా కెదురుగా కూర్చున్నారు. 'ఏమిటోయ్ విశేషాలు' అంది సరళ. 'అశేషం' అంది చిత్ర. 'కొంచెం తెలుగులో మాట్లాడదూ నీకుపుణ్యంఉంటుంది!' అంది శ్యామల.

మా క్లబ్బు సెక్రటరీ భారతీదేవి, డాక్టరు మధుసూదనంగారి భార్య సుబ్బలక్ష్మి మా ప్రక్కనుంచి వెళుతున్నారు. ఏదో పల్కరించాలన్నట్లు (చిత్రను మాత్రమే-ఎందుకంటే ఆమె తప్ప మేము ఎవ్వరమూ మేడల్లో వుండేవాళ్ళం కాదు. అవసరం వస్తే వాళ్ళకు "లిఫ్టు" ఇవ్వడానికి మాకు కార్లు లేవు) "ఏం చిత్రా! పంతాలేసుకుని నవ్వుతున్నారే మిత్రులంతా" అన్నది భారతదేవి. సుబ్బలక్ష్మిగారు పరామర్శకన్నట్లుగా "ఏం చిత్రా మీ అక్కగారి పిల్ల లిక్కడే వున్నారామ్మా" అన్నది. చిత్ర ముఖంలో నవ్వుపోయి విచార మలుముకునే లోపల అంత అందమైన ముఖమూ విచిత్రంగా వికృతమైనది. తేరుకుని 'ఊఁ' అంది చిత్ర. "రత్నాల్లాంటి పిల్లలు. అయితే పెళ్ళిచేసుకున్నారట గాదమ్మా" అన్నది సుబ్బలక్ష్మి. "ఎవరూ?" అన్నది భారతీదేవి. "వీళ్ళ బావగారండీ" సుబ్బలక్ష్మి పూర్తి చేసింది. చిత్ర కళ్లు నీళ్ళతో నిండాయి. అందరిమధ్యలో ఎంతో అవమానింపబడినట్లు బాధపడింది.

ఇక ఉండలేక "పోదాం" అన్నది. సరళా, శ్యామలా తెల్లపోయారు. కారుదగ్గర కెళ్ళాం. "ఖర్మం! డ్రైవర్ని పొమ్మన్నాను కాబోలు" ఉక్రోషం పట్టలేక తనను తాను విసుక్కుంది చిత్ర. అనునయిస్తూ "నేను డ్రైవ్ చేస్తాలే కూర్చో" అన్నాను. మాట్లాడకుండా కూర్చుంది చిత్ర. "అలా మినర్వాకు పోదామా?" అన్నాను. ఆమె మూడ్ కొంచెం బాగుచేద్దామని. "ఏంవద్దు ఇంటికి పద, పడుకోవాలి" అంది. బొత్తిగా ఓదార్చటం చేతకాని నేను కారును ఇంటివైపు తిప్పాను. "ఆహా సుబ్బలక్ష్మీ! నీదీ ప్రజ్ఞ అంటే! నందివర్ధనంలా నవ్వే చిత్ర ముఖాన్ని క్షణంలో ఎలామార్చేశావు! దీన్ని మార్చాలంటే నాశక్తి చాలదు" అనుకున్నాను మనస్సులో!

• • •

'ఒరేఒరే—చింపేస్తున్నావురా అక్కడపెట్టు" అన్నాను మా సురేష్ చేతిలో నలిగిపోతున్న నా పుస్తకాన్ని చూసి.

"అబ్బ, అలా అరుస్తావేం! చింపలేదులే" అని సురేష్‌ను దగ్గరకు తీసుకొని పుస్తకం నాకిచ్చాడు అన్నయ్య. తనకొడుకు నెవరైనా గద్దిస్తే వుత్త ఆడమ్మాయైపోతాడు అన్నయ్య.

"సావిత్రీ కొంచెం కాఫీపొడి యియ్యమ్మా. నిన్న అబ్బాయికి చెప్పటం మర్చిపోయాను. యివాళ ఆదివారం" అన్నది, పొద్దున్నే అప్పులకు బయలుదేరిన ఎదురింటావిడ, వదినతో. వదిన వంటింట్లోకి వెళ్ళింది. అన్నయ్య సురేష్ నెత్తుకుని చెక్కులుచిదిమి నవ్విస్తున్నాడు.

"ఈ బాబుకంటే పసిమి గాడూ! దొరబిడ్డలా ఉండేవాడు. దక్కకుండపోయాడుగాని!" అన్నదామె. కొరడాతో కొట్టినా మాఅన్న ముఖం అంతగా మారదేమో. సురేష్‌ను దింపి లేచాడు నెమ్మదిగా. వస్తూవస్తూ యీ మాటలువిన్న వదిన నీరసంగా కాఫీపొడి అందిచ్చిందామెకు.

"చాలసేపయింది వదినా వారువచ్చి—కాఫీ పొడిచ్చావా" అన్నాను నేను చూసికూడా చూడనట్టు "ఇంక దయచెయ్యి మహాతల్లీ అన్న ముఖం పెట్టి! ఆవిడ నా మాటలకు కొంచెం అదిరినా, రుంజుకోటానికి వీలుదొరక్క పెద్దపెద్ద అంగలేసుకుంటూ వెళ్ళిపోయింది.

అన్నయ్య పెద్దకొడుకు పోయి ఆరునెలలయింది. క్రమంగా మేము మర్చిపోయాం! అన్న మరిచాడు. వదినకూడా మర్చిపోయిందేమోగాని ఎదురింటి ఎల్లమ్మలు మాత్రం మర్చిపోలేదు మమ్ములను మరువనివ్వరు. ఉన్నబిడ్డను చూచి నవ్వుకునే ముఖాలు చూడలేక చచ్చిన బిడ్డను గుర్తుకుతెచ్చి సంతృప్తి పడతారీమనుష్యులు. పేరుకు ఇదంతా సానుభూతి!

• • •

హైకోర్టు రిజిష్ట్రారుగారి అమ్మాయిలు బొమ్మలు కొలువు దీర్చారట. పేరంటం కార్డులు పంపారు. చిత్రా, నేనూ కలసివెళ్ళాం. అందరూ పిల్లలూ, పెద్దలు. మా యీడువాళ్ళెవరూ లేరు. కొంచెం ఇరుగ్గా 'ఫీలయి' అటూఇటూ చూచాం. ఒకమూల ప్లీడరు గుమాస్తా రామనాధంగారి భార్య కనపడింది. తెలిసిన ముఖంగదాయని ఆమె పక్కన చేరాము వాళ్ళమ్మాయి సుగుణ స్కూల్ ఫైనలులో మా క్లాస్ మేట్.

"ఏమండీ మీ సుగుణకి యీఏడు పెండ్లి చెయ్యరూ" అన్న పలకరింపుతో రామనాధం గారి భార్య ఉలిక్కిపడింది. చిన్నగా నవ్వేసి "ఏమో కలసిరావాలి గదండీ" అన్నది. "అంటే సంకల్పం వుందన్నమాట" అన్నది రెండో ఆవిడ అక్కడి కా సంభాషణ తుంపటం ఇష్టంలేక. ఆ పక్క ఇంకెవరితోనో కబుర్లాడుతున్న ఇంకో కామెకు ఎట్లా వినబడిందో యీ సంభాషణ. వెంటనే యిటుదిరిగి "ఆమధ్య ఎవరో వచ్చి అమ్మాయిని చూసి వెళ్ళారటగా!!' అడిగేసింది ముఖాన! అప్పటి ఆ రామనాధంగారిభార్య ముఖాల్ని వర్ణించటానికి నేనింకేదైనా భాష నేర్చుకోవాలి! "ఆ-ఆదేం కలిసిరాలేదు" అని "నన్ను పంపిచరూ, ఇంటిదగ్గర చాలా పనుంది" అనేసి తాంబూలం తీసికొని వెళ్ళిపోయింది. సుగుణా మాలాగే కాలేజీలో జొరబడి చదువుతున్నా—వాళ్ళమ్మ 'మా అమ్మాయి చదువుకుంటోంది' అని చెప్పగలేదు. మా ఇందిరా వాళ్ళమ్మయితే "మా అమ్మాయి చేసుకోనంటోందండీ" అని ఢంకామీద దెబ్బ కొట్టినట్లు దబాయించేది. సుగుణా వాళ్ళమ్మ సుగుణలాంటిదే. 'కలిసిరాలేదు' అనే అబద్ధాన్నే అతి బలవంతంమీదగాని చెప్పలేక పోయింది. శ్రీమంతులం, సంపన్నులం, అందరితో మాట్లాడము-అనే గర్వం అక్కడెవరికీలేదు. గొప్ప గొప్ప యిల్లాళ్ళుకూడా ప్లీడరు గుమాస్తా భార్యను బాగానే పలకరించి పరామర్శచేసి పారిపోయేలా చేశారు. చిత్ర చిరాగ్గా 'ఇక పోదాం' అంది. మేమూ వచ్చేశాం-తాంబూలాలందుకుని.

కారులో కూర్చున్నాక చిత్ర "పాపం పూర్ వుమన్" అంది ఆమెను తల్చుకుంటూ. "ఏం! అంత జాలిపడ్తున్నావ్" అన్నాను నా మనస్సు బైట పెట్టకుండా!

"జాలిలేదు ఏంలేదుగాని-ఆ పరామర్శ ముఖాలను మాస్తే నాకసహ్యం. వాళ్ళు నవ్వరూ, నవ్వలేరు. ఎదురుగా ఎవరిముఖానైనా కాస్త నవ్వు కనపడితే, ఏవో పాతబడిన జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చి, ఆ నవ్వును కాస్తా చెరిపేసి వూపిరి తీసుకుంటారు" వుద్రేకంగా అన్నది చిత్ర. కాదనలేక ఊరుకున్నాను! ★

